TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 300 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.26.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం..

### డీమార్ట్, బిగ్ బజార్లను తలదన్నేలా..- సీఎం రేవంత్

హైదరాబాద్, అమృత్ తెలంగాణ: ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక లోభాగంగా మహిళా వారోత్సవాలను నిర్వహించుకుంటున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టే అద్భుతమైన కార్యక్రమం ఇది అని చెప్పారు. 8వేల మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేస్తున్నామని, దేశంలోనే ఇదొక అద్భుత కార్యక్రమం అని వెల్లడించారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు రేవంత్ రెడ్డి. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడు రాష్ట్రం ఆర్థికంగా నిలబడుతుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తోందన్నారు. ఒకేసారి 8వేల ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాలకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.




2023 డిసెంబర్ 7న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు రోజుల్లోనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పటివరకు ఉచిత ప్రయాణం కోసం 10 వేల కోట్ల రూపాయలను ఆర్టీసీకి చెల్లించామని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం వద్దని కొందరు రెచ్చగొట్టారని.. కానీ, మహిళా అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధి అని భావించి ఉచిత బస్సు ప్రయాణం ఇస్తున్నామని వివరించారు.

"మహిళలపై కుట్రను తిప్పి కొట్టి ఉచిత ప్రయాణం కొనసాగించాం. మహిళలను బస్సులకు యజమానులను చేయాలని 1000 బస్సు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా చేశాం. జూన్ 5న పరేడ్ గ్రౌండ్ లో 553 బస్సులను ప్రారంభించబోతున్నాం. సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ గుర్తుకు వస్తారు. 1000 మెగా వాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను మహిళా సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయిస్తోంది. రిలయన్స్ వాళ్లు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాన్ని మహిళా స్వయం సహాయక సంఘాలతో చేయిస్తున్నాం. మారుమూల గ్రామాల్లోని మహిళలు ఆర్థికంగా నిలబడాలన్నదే ప్రయత్నం.

5 లక్షల వరకు బ్యాంక్ లింకేజీ లోన్ లను 10 లక్షలకు పెంచుతున్నాం. ఇప్పటివరకు 60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్ లు అందించాం. సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే 1390 కోట్ల రూపాయలను చెల్లించింది. మహిళలు తీసుకున్న ప్రతి రూపాయిని చెల్లించి ముందుకు వెళ్తున్నారు. లోన్లు తీసుకున్న వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్నారు.

మహిళా సంఘాలు రైస్ మిల్లులు ఏర్పాటు చేసుకోవాలి. మండలాల్లో గోడౌన్లు, లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవాలి. 100 ఎకరాల వరకు భూములను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైస్ మిల్లులు, గోడౌన్ల కోసం ప్రభుత్వ భూములను కేటాయిస్తాం. ఆడబిడ్డలు ప్రతి గింజకు జవాబుదారిగా ఉంటారు. ఇక ముందు మిల్లుల గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టం. స్వయం సహాయ మహిళా సంఘాలు వడ్లు కొనుగోలు చేసి బియ్యం ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. రైస్ మిల్లులు, గోడౌన్ల ఏర్పాటు కోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ ఏర్పాటు చేసి కావాల్సిన రుణాలను మంజూరు చేస్తాం.

కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లు..

మహిళా సంఘాలతో మహిళా శక్తి సూపర్ బజార్లు కార్పొరేట్ తరహాలో ఏర్పాటు చేయాలి. మహిళా శక్తి సూపర్ బజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటాదారుగా ఉంటుంది. నాణ్యమైన వస్తువుల కోసం మహిళా శక్తి సూపర్ బజార్ లో దొరికేలా ఏర్పాటు చేసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో సూపర్ బజార్ల కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకు లీజుకు ఇస్తాం. దేశంలోనే బెస్ట్ సూపర్ బజారుగా తయారు కావాలి. డీమార్ట్, బిగ్ బజార్ ల కంటే బెస్ట్ గా మహిళా శక్తి సూపర్ బజార్లు ఉండాలి. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుంది. ఈ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చే శక్తి మహిళలకు ఉంది. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం.

రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డకు సారెలా చీరలు అందజేసింది. గతంలో ఇచ్చిన చీరలు పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగించారు. ఇందిరమ్మ చీరలతో పాలపిట్టల్లా ఆడబిడ్డలు కనిపిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తారు. చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలు ఇవ్వబోతున్నాం. అన్నదమ్ములు కొందరు ఇంట్లో నుంచి చెల్లెళ్లను వెళ్లగొడుతున్నారు. ఈ మధ్య రాజకీయాల్లో కొందరు చెల్లిని బయటకు వెళ్లగొడితే బయటకు వెళ్లి ఎలా శాపనార్థాలు పెడుతుందో చూస్తున్నాం" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## గ్రామ పంచాయతీలకు గుడ్ న్యూస్




హైదరాబాద్ :గ్రామ పంచాయతీలకు గుడ్ న్యూస్ తెలంగాణలోని గ్రామీణ స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర 16వ ఆర్థిక సంఘం భారీగా నిధులను కేటాయించింది. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు ఐదేళ్ల కాలానికి గాను రాష్ట్రానికి రూ.9,968 కోట్లను నిర్దేశించింది. ఈ నిధుల వినియోగం, పర్యవేక్షణ, పారదర్శకతపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిధులను కేవలం గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ రహదారులు, స్ట్రీట్ లైట్‌ల ఏర్పాటు వంటి ప్రజా సేవల కోసమే వినియోగించాలని కేంద్రం స్పష్టం చేసింది. అయితే ఈ గ్రాంట్లను ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపుల కోసం ఉపయోగించరాదని ఖచ్చితమైన నిబంధన విధించింది. నిధుల దుర్వినియోగానికి తావులేకుండా ఉండేందుకు కేంద్రం కఠినమైన పర్యవేక్షణ నిబంధనలను తెచ్చింది.

ప్రతి స్థానిక సంస్థ ఎప్పటికప్పుడు తమ వ్యయ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. త్రైమాసిక, వార్షిక పురోగతి నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని, వాటి ఆధారంగా సమగ్ర నివేదికలను రాష్ట్రం కేంద్రానికి సమర్పించాలని ఆదేశించింది.

## కార్యకర్తల త్యాగాలను పార్టీ ఎప్పటికీ మర్చిపోదు



ఖమ్మం.అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో సైతం అండగా నిలిచిన కార్యకర్తలను పార్టీ, ప్రభుత్వం ఎప్పటికీ మర్చిపోదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) చైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మహమ్మద్ ఖాదర్ బాబాల అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ మట్ట రాగమయి, రాందాస్ నాయక్, కూనంనేని సాంబశివరావులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ నాయకులకు పదవులు వచ్చినప్పుడు కార్యకర్తలు చూపుతున్న ఆనందం పార్టీపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

దేశ స్వాతంత్ర్య సమరానికి ముందే గ్రంథాలయ ఉద్యమాలు ప్రజల్లో చైతన్యం నింపాయని, ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, జనగాం ప్రాంతాలు ఆ ఉద్యమాలకు కేంద్ర బిందువులుగా నిలిచాయని గుర్తుచేశారు. ప్రజలపై అత్యంత ప్రభావం చూపే సంస్థ గ్రంథాలయమని, అలాంటి సంస్థకు చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మహమ్మద్ ఖాదర్ బాబాకు అభినందనలు తెలిపారు. సుడా, జిల్లా గ్రంథాలయ సంస్థల ద్వారా ప్రజలకు మరింత మేలు జరిగేలా పని చేయాలని సూచించిన ఆయన, ప్రజలకు సేవలు అందించేందుకు అవసరమైన సహకారం స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు తప్పనిసరిగా అందిస్తారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజల అభివృద్ధి కోసం సాధించుకున్నామని, గత పాలకులు ప్రజల అవసరాలను పక్కనపెట్టి రాష్ట్రాన్ని కుటుంబ ప్రయోజనాల కోసం వినియోగించారని విమర్శించారు.

ప్రతి ఏటా మహిళలకు 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి 550 బస్సులు కేటాయించినట్టు చెప్పారు. ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని, పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాల్లో బ్రేక్ ఫాస్ట్, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. జూన్ 2 నుంచి కోటి 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభిస్తున్నామని, 5 లక్షల బీమా సహాయం రక్షణ కవచంలా నిలుస్తుందని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన నాయకులకు నేడు సుడా చైర్మెన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పదవులు రావడం సంతోషకరమని అన్నారు.

నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తే రాష్ట్ర నాయకత్వం తప్పకుండా గుర్తింపు ఇస్తుందని చెప్పారు. పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ కు పదవి రావడం తనకు వ్యక్తిగతంగా ఆనందంగా ఉందని, ఖమ్మం నగరంతో పాటు పరిసర మండలాల అభివృద్ధికి సుడా ద్వారా మరిన్ని నిధులు తీసురావాలని సూచించారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఖమ్మం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి అప్పులు ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి లోటు లేకుండా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. డిప్యూటీ సీఎం, మంత్రి, ఖమ్మం ఎంపీ, సుడా చైర్మెన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మెన్ నాయుడు సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారంకై సీఎంతో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు భేటీ

హైదరాబాద్ .అమృత్ తెలంగాణ:పంటల కొనుగోలు చేయాలని, కార్మికులకు కనీస వేతనాల సవరణ, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సీఎం రేవంత్ రెడ్డికి మెమోరాండం ఇచ్చారు.



పంటల కొనుగోలు

తెలంగాణలో యాసంగి పంటల కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని, 62 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 140 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని, 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీ యిచ్చింది. 8,576 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. నిన్నటివరకు 50 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు ప్రకటించారు. ఇంకా 40 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాల్సి వుంది. రోహిణి ప్రారంభమైంది. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడిసిపోయింది. రైతులు తీవ్ర ఆందోళనలో వున్నారు. మిల్లర్లు కొనుగోలు కేంద్రం దగ్గర తరుగు తీసిన తర్వాత మళ్ళీ మిల్లు దగ్గర తరుగు తీస్తున్నారు. నెలల తరబడి కొనుగోలు కేంద్రాల దగ్గర రైతులు పడిగాపులు పడాల్సి వస్తున్నది. వీటిని నివారించాలని కోరుతున్నాం..

యాసంగిలో పండిన మొక్కజొన్న ఎకరానికి 40 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తున్నది. కానీ, ప్రభుత్వం మార్ఫెడ్ ద్వారా 26 క్వింటాళ్ళే కొనుగోలు చేస్తున్నది. మిగిలిన మొక్కజొన్నలను మద్దతు ధర కంటే తక్కువ ధరకు (ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముకొని రైతులు నష్టపోతున్నారు. పండిన మొక్కకొన్నలన్నింటినీ కొనే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నాం. కొనుగోలు చేసి నెలరోజులైనా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయలేదు. జొన్నలు, నల్ల కునుమలు యాసంగిలో బాగా దిగుబడి వచ్చింది. వీటిని కూడా సకాలంలో కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని కోరుతున్నాం.

కనీస వేతనాలకు సంబంధించి

షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ సుమారు 14 సం॥రాలు తర్వాత కనీస వేతనాలు సవరించడాన్ని ఆహ్వానిస్తున్నాం. కానీ, కనీస వేతనాలను రాష్ట్రంలో 3 జోన్స్ (మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాలు)గా విభజించారు. దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారు. వేతనాలను 4 క్యాటగిరీలుగా విభజించి అన్ని రంగాల్లో ఒకే -రీతిలో వేతనాలు పెంచడం వల్ల గతంలో ఎంప్లాయిమెంట్స్లో వివిధ రకాల పనులకు వివిధ రకాలుగా ఉన్న పద్ధతి అలేకుండా పోతుంది. కనీస వేతనాల పెంపుదల సందర్భంగా కరువుభత్యం గురించి ప్రస్తావన చేయలేదు.

పెరిగిన వేతనాలు కూడా 4 క్యాటగిరీలలో అన్స్కిల్డ్ వర్కర్లకు రూ. 1 లవేలు, సెమిస్కిల్డ్ వర్కరు రూ. 17 వేలు, స్కిల్డ్ వర్కరు రూ. 18,500లు, హైస్కిల్డ్ వర్కర్లకు రూ.20 వేలు పెంచినట్లుగా ప్రకటించారు. ఇందులో అన్స్కిల్స్ వర్కరు తప్ప మిగితా వారికి బేసిక్ కరువుభత్యం కలుపుకొని ఇప్పటికే వస్తున్న జీతానికి, పెరిగిన జీతానికి పెద్ద తేడా ఏమీలేదు. పట్టణ, గ్రామీణ, ప్రాంతాల్లో వేతనాలు ఇంకా తగ్గే పరిస్థితి ఉన్నది.

కాంట్రాక్ట్ లేబర్ జీవో నెం.11 ప్రకారం ఇప్పటికే రాష్ట్రంలో రూ. 18,098ల నుండి రూ.23,683 వరకు వేతనం పొందుతున్నారు. ప్రభుత్వం పెద్దగా పెంచిందేమీలేదు. ప్రస్తుతం అమలులో ఉన్నా జీవో నెం. 4తో పోలిస్తే కూడా కొన్ని కేటగిరీల్లో స్వల్పంగా పెరుగుదల, కొన్ని కేటగిరీల్లో ప్రస్తుతం పొందుతున్న వేతనం కంటే తగ్గుదల ఉ న్నది. జీవో నెం.4లో స్కిల్డ్ వర్కర్ కి వేతనం రూ. 19,572లు ఉండగా, ప్రభుత్వం ప్రకటించిన వేతనం రూ. 18,500 మాత్రమే గతంలో పోలిస్తే రూ.1,072లు తగ్గింది. సఫాయి కర్మవాదులకు జోనె1లో పాత వేతనం రూ.17,332లు ఉండగా, కొత్త వేతనం రూ.16వేలు, ఈ కార్మికులకు రూ.1,332లు తగ్గింది. జోన్ 2లో పాత వేతనం రూ. 17,072 లు ఉండగా, కొత్త వేతనం రూ.16వేలుగా ఉన్నది. ఈ కార్మికులకు రూ.2,072లు తగ్గింది. జోన్ 3 పాత వేతనం రూ.16వేలు వేతనం ఉండగా, కొత్త వేతనం రూ.14 వేలు. ఈ కార్మికులకు రూ.2వేలు వేతనం తగ్గింది.

గతంలో కనీస వేతనాల సలహా మండలి బోర్డు అని స్కిల్డ్ కార్మికుడికి కనీస వేతనం రూ. 18,019లు, కరువుభత్యం ఒక్కొక్క పాయింటికి రూ.12లు సిపార్సులు చేసింది. దీంతో 2021 జూన్ 5న అప్పటి ప్రభుత్వం 5 జీవోలను జారీ చేసింది. వాటికి నాటి నుండి నేటి వరకు గెజిట్ విడుదల చేయలేదు. ఈ జీవోల ప్రాతిపదికన నేను కనీస వేతనాలు మరింత పెరిగేవి. దేశానికే ఆదర్శవంతంగా ఉందే విధంగా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాలను పెంచుతామని తమరు ప్రకటించారు. కానీ అచరణలో పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచలేదు.

పెరిగిన ధరలు 1948 కనీస వేతనాల చట్టం, డాక్టర్ అక్ట్రాయిడ్ నిర్వహించిన విధానం, సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా శాస్త్రీయంగా వేతనాలను లెక్కిస్తే రూ.32 వేలు పెంచాలి. కార్మికులు, కార్మిక సంఘాలు కనీసం రూ.26,000లు వేతనం ఉండాలి. కర్ణాటక రాష్ట్రంలోని అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం 60శాతం కార్మికుల వేతనాలను పెంచింది.

# జూన్ 1న జిల్లావ్యాప్తంగా 'ఇందిరమ్మ ఇళ్ల' సామూహిక గృహప్రవేశాలు: కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రాబోయే జూన్ 1వ తేదీన జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీ వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సోమవారం క్యాంపు కార్యాలయం నుండి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, సామూహిక గృహప్రవేశాలు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల సర్వే, నిలిచిపోయిన ఇళ్ల పనులపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో గృహప్రవేశాల కింద మొత్తం 2,773 ఇళ్ల లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 1,708 ఇళ్లు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 1,065 ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని హౌసింగ్, మండల అధికారులను ఆదేశించారు. జూన్ 1వ తేదీ నాటికి ఈ ఇళ్లన్నింటినీ సిద్ధం చేసి, లబ్ధిదారులతో ఉమ్మడిగా గృహప్రవేశాలు చేయించేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మరోవైపు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో భాగంగా జిల్లాలోని అర్హులైన లబ్ధిదారుల గుడిసెల వివరాలను గెజిటెడ్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సర్వే చేయించాలని ఆదేశించారు. ఈ సర్వే నివేదికలను నేరుగా కలెక్టర్ లాగిన్‌కు పంపాలని, తద్వారా వీలైనంత త్వరగా వీటికి శాంక్షన్ ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. వీటితో పాటు జిల్లాలో ఇంకా పనులు ప్రారంభం కాని ఇళ్లు ఉంటే, వెంటనే లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో హౌసింగ్ నోడల్ అధికారి శంకర్, ఈడియం రవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎంపీడీఓలు, ఈఈలు, ఏఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ పి. నర్సారెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



నిర్మల్: మాజీ మంత్రి స్వర్గీయ పి. నర్సారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డితో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వర్గీయ పి. నర్సారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాసేవలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. రాజకీయాల్లో నిబద్ధతతో పనిచేసి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకుడిగా పి. నర్సారెడ్డి నిలిచారని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఆయన రాజకీయ ప్రస్థానం, ప్రజల కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో హన్మంత్ రావు, ఇంద్ర కరణ్ రెడ్డి, వేణు గోపాల్ చారీ, శ్రీ హరి రావు, లైబ్రరీ చైర్మన్ అర్జుమాండ్ అలీ, పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ లు తాహిర్ బిన్ అంబడని, మనలా మోహన్ రెడ్డి, శేఖర్ గౌడ్, మాజీ డీసీసీబీ చైర్మన్ అద్ది భోజ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ సంజీవ్ రెడ్డి మాజీ డీసీసీ సాజిద్ ఖాన్, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గంద్రత్ సుజాత. తదితరులు పాల్గొన్నారు

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి:జిల్లా కలెక్టర్ రాజర్షి షా,





అమృత తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రజా ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం అధికారుల ప్రాధాన్య కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 91 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందే ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యలపై తీసుకున్న చర్యల నివేదికలను సమయానికి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పదేపదే ఒకే సమస్యపై ఫిర్యాదులు రావడం జరుగకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, డిఆర్ఓ స్రవంతి, డీఆర్‌డీవో రవీందర్, డీఏండబ్ల్యూఓ కలీం, తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల్లో పాల్గొన్న మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన మహిళా వారోత్సవాల కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి, భద్రత, సంక్షేమం కోసం అనేక వినూత్న పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వంటి పథకాలు మహిళల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు ప్రతి రంగంలో ముందుకు రావడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ రెడ్డి ని పరామర్శించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ ఇచ్చోడా న్యూస్ ఇటీవలే ఇచ్చోడ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాగర్ రెడ్డి గారి మాతృమూర్తి పరంవదించిన విషయం తెలుసుకున్న ఆడే గజేందర్ గారు ఈ రోజు వారి ఇంటికెళ్ళి పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు ఆయన వెంట మండల అధ్యక్షులు కళ్యెం నారాయణ రెడ్డి, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ ముస్తఫా, ఎస్సీ సెల్ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి రెడ్డి, మాజీ ఎంపీటీసీ జాహిద్, మండల మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్, నాయకులు నడికుంట ఆశన్న, మధుకర్, షేక్ మహబూబ్, బొజ్జ సాయన్న, ఎండి సద్దాం, జహీర్, ఈశ్వర్, సాదిక్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు

# జిల్లాలో ఘనంగా ప్రారంభమైన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాలు: ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "మిషన్ శక్తి" మహిళా వారోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళల రక్షణ, భద్రత, ఆరోగ్యం, వారి ఆర్థిక స్వావలంబన సాధించడమే "మిషన్ శక్తి" యొక్క ముఖ్య ఉద్దేశమని, సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా వారోత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ వారోత్సవాలు నేటి (మే 25) నుండి 30 వరకు జిల్లావ్యాప్తంగా మహిళా చట్టాలు, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం, స్వయం ఉపాధి వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు అన్ని రకాల స్కానింగ్‌లు, వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ సెంటర్లకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. మహిళలు రక్తహీనతను జయించడానికి నిత్యం ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవాలన్నారు. అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర ఉండే ప్యాకేజ్డ్, జంక్ ఫుడ్స్ వల్ల చిన్న వయసులోనే బీపీ, డయాబెటిస్ వంటి వ్యాధులు వస్తాయని హెచ్చరిస్తూ "సే నో టు జంక్ ఫుడ్" అని పిలుపునిచ్చారు. ఇంట్లో వండుకునే జొన్న రొట్టెలు, సాంప్రదాయ ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో జరిగే అన్ని అవగాహన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మహిళల్లో ఈ అంశాలపై ఆశా కార్యకర్తలు, టీచర్లు, ఏఎన్ఎంలు నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్, అంగన్వాడీ స్టాల్ లను సందర్శించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళ ఉద్యోగులకు మెమొంటో లను ముఖ్య అతిథిలు అందజేశారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, సంబంధిత శాఖల అధికారులు, పర్యవేక్షకులు, అంగన్‌వాడీలు, మహిళలు, సఖి కేంద్రం సిబ్బంది, పాల్గొన్నారు.

# కుర్మే మహేందర్ ని సన్మానించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కుర్మే మహేందర్ గారిని నేడు నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న కుర్మే మహేందర్ గారికి రాష్ట్ర స్థాయి బాధ్యతలు రావడం బోథ్ నియోజకవర్గానికి గర్వకారణమన్నారు.

పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా ఎస్సీ వర్గాల అభివృద్ధికి ఆయన మరింత సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ గ్రామాల సర్పంచ్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం

రాజన్న సిరిసిల్ల అమృత్ తెలంగాణ: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వివిధ మండలాలకు సంబంధించిన గ్రామాల ఉపసర్పంచుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులుగా గంభీరావుపేట ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో తంగళ్ళపల్లి మండల ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఆసాని శ్రీకాంత్ రెడ్డి, ఎల్లారెడ్డిపేట మండల ఉప సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు మందాటి రాము యాదవ్, వీర్నపల్లి మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అజ్మీరా రామ్ రెడ్డి నాయక్, ముస్తాబాద్ మండలం ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు విజయ రెడ్డి, కోనరావుపేట మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు. లంబ రాజు యాదవ్, బోయన్ పెల్లి మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మిట్టపల్లి శ్రీనివాస్ రెడ్డి, చందుర్తి మండల ఉపసర్పంచల ఫోరం అధ్యక్షులు గంట మల్లేష్, వేములవాడ రూరల్ ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఎడిటర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షునికి ఘన సత్కారం

ఆదిలాబాద్, సోమవారం: ఆదిలాబాద్ జిల్లా ఎడిటర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ ఎలుగు లింగన్నకు ఘన సన్మానం జరిగింది. తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) తరపున ఆదిలాబాద్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా ఆయన నియమితులైనందుకు, జిల్లా ఎడిటర్స్ సంఘం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్ ( సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్) మాట్లాడుతూ, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా ఎంపికైన లింగన్నకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సుదీర్ఘ అనుభవం ఉన్న లింగన్న ఈ కమిటీలో సభ్యునిగా ఉండటం వల్ల జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కమిటీలో సభ్యునిగా లింగన్నను ఎంపిక చేసినందుకు టీజేఏ ఫౌండర్, సీనియర్ జర్నలిస్ట్ ఉప్పల లక్ష్మణ్ కు అసోసియేషన్ తరఫున ఫిరోజ్ ఖాన్ మరియు సింగిడి అమృత్ కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం టీజేఏ ఎల్లప్పుడూ ముందు ంటుందని ఆయన గుర్తు చేశారు. ఈ ఘన సత్కార కార్యక్రమంలో జిల్లా ఎడిటర్స్ అసోసియేషన్ ఇతర సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




సాక్షర తెలుగు దినపత్రిక ఎడిటర్ లింగన్నకు సంఘం తరపున ఆదిలాబాద్ జిల్లా ఎడిటర్స్ అధ్యక్షులు ఫిరోజ్ ఖాన్ ఉపాధ్యక్షులు సింగిడి అమృత్ సన్మానం చేస్తున్న దృశ్యం

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా మే 25 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, అక్కడ తగిన నివారణ చర్యలు అమలు చేయాలని తెలిపారు. బ్లాక్ స్పాట్స్, జాతీయ రహదారులపై అవసరమైన చోట సూచిక బోర్డులు, వేగ నియంత్రికలు, రేడియం లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కలిగేలా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే రోడ్డు భద్రత వారోత్సవాలు, "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. భారీ వాహనాల డ్రైవర్లు, పాఠశాల బస్సుల డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. వీరికి ప్రత్యేకంగా రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. త్వరలోనే పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్



బస్సుల సామర్థ్యాలను తనిఖీ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,ఎఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, డీఎంహెచ్ఓ రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జూనియర్ బాస్కెట్‌బాల్ లీగ్ 'నిజాం రాయల్స్'కు ఎంపికైన వడ్డెపల్లి సుధాన్వి

జగిత్యాల అమృత్ తెలంగాణ మే 25:తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "తెలంగాణ జూనియర్ బాస్కెట్‌బాల్ లీగ్" (అండర్-15 టోర్నమెంట్‌కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ఒక అరుదైన రికార్డు సాధించింది. ఇటీవల జరిగిన టీజీబీఎల్ ఆటగాళ్ల వేలంలో స్థానిక క్రీడాకారిణి వడ్డెపల్లి సుధాన్వి ప్రతిభ చాటి 'నిజాం రాయల్స్' జట్టుకు ఎంపికైంది. జగిత్యాల పట్టణానికి చెందిన వడ్డెపల్లి మహేష్ కుమార్ మరియు లక్ష్మీ కుమారి దంపతుల కుమార్తె అయిన సుధాన్వి.. ఈ లీగ్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ఎంపికైన తొలి క్రీడాకారిణిగాలి సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశంలోనే మొదటిసారిగా జూనియర్ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ లీగ్‌కు రాష్ట్రవ్యాప్తంగా భారీ స్పందన లభించగా, కఠినమైన సెలక్షన్ ట్రయల్స్ మరియు వేలం ప్రక్రియ ద్వారా సుధాన్వి తన స్థానాన్ని ఖరారు చేసుకుంది. ఈ అద్భుతమైన అవకాశాన్ని దక్కించుకున్న సుధాన్విపై, ఆమె తల్లిదండ్రులపై ఉమ్మడి జిల్లా క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు మరియు స్థానికులు ప్రశంసల జల్లు కురిపిస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. రాబోయే టోర్నమెంట్‌లో ఆమె మరింతగా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని



ఆకాంక్షిస్తున్నారు. ఈసందర్భంగా మార్కండేయ దేవాలయం ప్రధాన అర్చకులు మేడిపల్లి శ్రీనివాస్ శర్మ శాలువా కప్పి ఆశీర్వచనం చేసి అభినందించారు. జగిత్యాల పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు భోగ గంగాధర్, ఉపాధ్యక్షుడు భోగ రాజు, ప్రధానకార్యదర్శి జయరాజ్, సహాయకార్యదర్శి మానపురి మహేష్, కోశాధికారి కొక్కుల ప్రభాకర్, మంచాల జమున, మ్యాన శబరి, కస్తూరి నరేష్, కొప్పు సందీప్, వేముల శంకర్, సాంబరి కళావతి తదితరులున్నారు.

# మెట్‌పల్లి 3వ వార్డులో అగ్ని ప్రమాదం.. అప్రమత్తమైన కౌన్సిలర్

మెట్‌పల్లి, అమృత్ తెలంగాణ మే 25: మెట్‌పల్లి పట్టణంలోని 3వ వార్డులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి స్థానికులను భయాందోళనకు గురిచేశాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న 3వ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేష్, వెంటనే స్పందించి ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. మంటల తీవ్రతను గమనించిన ఆయన, వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అయితే, అక్కడ ఫైర్ ఇంజన్ అందుబాటులో లేదని తెలియడంతో నరేష్ ఏమాత్రం ఆలస్యం చేయలేదు. ప్రమాదం మరింత విస్తరించకుండా ఉండేందుకు తనవంతు ప్రయత్నంగా వెంటనే వాటర్ ట్యాంకర్లను తెప్పించారు. స్థానికుల సహకారంతో స్వయంగా మంటలను ఆర్పివేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కౌన్సిలర్ నరేష్ చూపిన ఈ చొరవను, అప్రమత్తతను స్థానికులు అభినందించారు. ప్రమాద సమయంలో ప్రజల



పక్షాన నిలిచి తక్షణ సహాయం అందించిన కౌన్సిలర్ తీరుపై స్థానికుల్లో ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రజాప్రభుత్వం లక్ష్యం

**బ్యాంకు లింకేజీ, రుణ చెల్లింపులో నిర్మల్ జిల్లా ఆదర్శం**

**రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**

**ఒకే రోజు, ఏకకాలంలో 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు**

నిర్మల్ జిల్లా మే 25 అమృత్ తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని సి ఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాల్లో భాగంగా మహిళా సంఘాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలను సీఎం వర్చువల్ విధానంలో నిర్వహించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి.అనసూయ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిల్లా శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్రంలోని మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు (వీవో భవనాలు) శంకుస్థాపనలు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ భవనాలు మహిళా సంఘాల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలిపారు.

రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.60,470 కోట్ల రుణాలు అందించామని, దీని ద్వారా సుమారు 5 లక్షల మంది మహిళలు వ్యాపారవేత్తలుగా మారారని సీఎం వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా, వారిని బస్సుల యజమానులుగా కూడా తీర్చిదిద్దామని అన్నారు. మహిళా సంఘాలు పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు, మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

బ్యాంకు లింకేజీ, రుణ వసూళ్ల సాధనలో నిర్మల్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని సీఎం ప్రశంసించారు. గ్రామాల్లో పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయంపై మహిళా సంఘాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని




సూచించారు.

అనంతరం పలు జిల్లాల మహిళా సంఘాలతో సీఎం వర్చువల్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణితో మాట్లాడి, జిల్లాలో మహిళా సంఘాల పనితీరును అభినందించారు. మళ్లీ జిల్లాకు వచ్చినప్పుడు నేరుగా కలుస్తానని తెలిపారు.

జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారు.

మండల మహిళా సమాఖ్యల ద్వారా పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ అంశాలపై విశేషంగా పనిచేసే మహిళా సమాఖ్యలను గుర్తించి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రజాప్రభుత్వం లక్ష్యం : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

**ఒకే రోజు, ఏకకాలంలో 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు**

**ఆదిలాబాదు జిల్లా పరిషత్ సమావేశ మందిరం నుండి హాజరైన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అధికారులు**




సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా,




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాల్లో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు మరియు గ్రామ సంఘ భవనాల (ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలు) భూమి పూజ కార్యక్రమాన్ని సీఎం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి.అనసూయ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిల్లా శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపనలు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ భవనాలు మహిళా సంఘాల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలిపారు. రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.60,470 కోట్ల రుణాలు అందించామని, దీని ద్వారా సుమారు 5 లక్షల మంది మహిళలు వ్యాపారవేత్తలుగా మారారని సీఎం వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా, వారిని బస్సుల యజమానులుగా కూడా తీర్చిదిద్దామని అన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు, రైస్ మిల్లులు, గోదాములు, మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు.

హైదరాబాద్ నుండి సీఎం నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఇతర జిల్లా అధికారులు మరియు స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా సంఘాల బలోపేతానికి, వారి ఆర్థికాభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరపున మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి సూచించిన విధంగా మహిళా సంఘాల ద్వారా గ్రామాల్లో పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు అధికారులు, వివిధ మండలాల మహిళా సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారుల సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి.

**పోలీస్ ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహణ.**

**జిల్లా నలుమూలల నుండి విచ్చేసి 32 ఫిర్యాదులను అందజేసిన బాధితులు.**

**సమస్య విన్న వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా పరిష్కారానికి ఆదేశాలు.**

**ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాల సమాచారమైన 8712659973 నెంబర్ కి వాట్సాప్ లో తెలియజేయవచ్చు**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.ఐపీఎస్**


అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రతి సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ గారి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు విచ్చేసి నేరుగా జిల్లా ఎస్పీకి తమ సమస్యలను తెలియజేశారు. విన్న వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా జిల్లా ఎస్పీ బాధితుల సమస్యలను పరిష్కరించడానికి ఆదేశాలను జారీ చేయడం జరిగింది. బాధితుల సమస్యల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. సమస్యలను పరిష్కరించినప్పుడు పోలీసు వ్యవస్థ పై ఉన్న నమ్మకం మరింత పెంపొందించబడుతుందని, ప్రజలలో పోలీసుల పట్ల ఉన్న గౌరవం పెరుగుతుందని తెలిపారు. బాధితులకు అన్యాయం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయంలో 32 ఫిర్యాదులను నమోదు కాగా అందులో భార్యాభర్తల సమస్యలు, కుటుంబ సమస్యలు, కేసుల సమస్యలు, భూ సమస్యలు ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపేందుకు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని, ప్రశాంతమైన వాతావరణంలో జిల్లా కొనసాగడానికి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని, వాటిని తుడిచి పెట్టే దిశలో



ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాల సమాచారం అయినా 8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# ఎల్లమ్మ బోనాల పండుగలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి

జగిత్యాల అమృత్ తెలంగాణ మే 25: జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఎల్లమ్మ పట్నాలు బోనాల సందర్భంగా ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ,మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ గారు, సీనియర్ నాయకులు తాటిపర్తి రాంచంద్ర రెడ్డి మరియు వివిధ హోదాల ఉన్న నాయకులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 25, 2026: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన పోగాకు బుచ్చిబాబు తాము కొనుగోలు చేసిన భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టి కొంతమేర చేసి అనివార్య కారణాలతో నిలిపివేయడం జరిగిందని, నిర్మాణ గడువును పొడిగిస్తూ అనుమతి పత్రం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి పట్టణం ఒర్రెగడ్డ ప్రాంతానికి చెందిన బర్ల సుగుణ తన భర్తకు చెందిన ఆస్తిని ఆయన మరణానంతరం పెద్ద కుమారుడు తన పేరిట మార్పు చేసుకునేందుకు కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ క్రమంలో ఆస్తి మార్పిడిపై విచారణ జరిపి తమను రక్షించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం సింగాపూర్ కు చెందిన సల్లూరి పోశమ్మ తన భర్త పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆయన మరణించారని అట్టి ఇంటిని తనకు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామానికి చెందిన మద్దెల గట్టయ్య తనకు గుడిపేట శివారులో గల భూమి రెవెన్యూ రికార్డులలో తప్పుగా నమోదు అయిందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణ రాజీవ్ నగర్ కాలనీకి చెందిన బొల్లం సుజాత తాను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా ఎల్ 1 జాబితాలో ఉండి ఫేజ్ 1, 2 జాబితాలో పేరు రాలేదని, ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ కు చెందిన గెరిక దుర్గ తాము పూల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నామని,

రెండు పడక గదుల ఇండ్లలో లక్కీ డ్రా పద్ధతిన ఇల్లు వచ్చిందని, సర్వే చేసి ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ సర్వర్ బి తన భర్త చనిపోయాడని, పిల్లల పోషణ కొరకు తనకు ఆసరా పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 91 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు మెరుపుతో వరి చేను దగ్ధం..రైతుకు రూ.50 వేల నష్టం

ఆలేరు రూరల్ :అమృత్ తెలంగాణ: ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో కరెంటు మెరుపు కారణంగా వరి చేను దగ్ధమై రైతుకు భారీ నష్టం వాటిల్లింది.గ్రామానికి చెందిన రైతు గంగరాజు రామకృష్ణకు చెందిన వరి పంట ఒక్కసారిగా మంటలకు ఆహుతై సుమారు 50 బస్తాల దిగుబడి నష్టం జరిగినట్లు తెలిపారు.ఈ ఘటనతో రైతుకు దాదాపు రూ.50 వేల మేర ఆర్థిక నష్టం సంభవించినట్లు తెలుస్తోంది.పంట నష్టం కారణంగా తీవ్ర ఆవేదనకు గురైన రైతు గంగరాజు రామకృష్ణ కన్నీళ్లతో తన బాధను వ్యక్తం చేశారు.ఇప్పటికే వ్యవసాయ ఖర్చులు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఈ ప్రమాదం మరింత కష్టాల్లోకి నెట్టిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఘటనపై అధికారులు పరిశీలన జరిపి తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.స్థానిక రైతులు కూడా బాధిత రైతుకు ప్రభుత్వం అండగా నిలిచి నష్టపరిహారం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కరెంటు మెరుపుల వల్ల పంటలకు నష్టం జరగకుండా సంబంధిత శాఖలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



# మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ అంతక్రియలో పాల్గొన్న మాజీమంత్రి జోగు రామన్న

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ధారవేణి సత్యనారాయణ గారి అంత్యక్రియలను శాంతినగర్‌లోని వారి నివాసం నుండి ఘనంగా నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని పాడేను మోస్తూ శోభాయాత్రలో నడిచారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ, సత్యనారాయణ గారు బి ఆర్ఎస్ పార్టీలో ఎంతో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. వారి మరణం పార్టీకి తీరని లోటని, ప్రజలతో మమేకమై సేవా భావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని నివాళు లర్పించారు. బి ఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు



పాడే మోస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# చెన్నూర్ లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

అమృత్ తెలంగాణలి మంచిర్యాల జిల్లా న్యూస్ మే 25, 2026 : జిల్లాలోని చెన్నూర్ లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఈసారి వరి పంట అంచనాలకు మించి అధిక దిగుబడి వచ్చిందని, ప్రస్తుతం నెలకొన్న అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయడం కోసం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడం ద్వారా కొనుగోలు వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ ప్రాంతంలో ధాన్యం నిల్వ కొరకు గోదాముల సౌకర్యం, హమాలీల సంఖ్య పెంపొందించడం జరుగుతుందని, ప్రస్తుతం ఉన్న లారీలకు 75 లారీలను అదనంగా కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా




కలెక్టర్, అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. రాబోవు వారం రోజులలో రైతుల వద్ద నుండి ప్రతి గింజ కొనుగోలు చేసి ప్రభుత్వ నిర్దేశిత మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని, రైతులు ఆలస్యం చేయకుండా వరి ధాన్యంను కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని తెలిపారు.


# బొద్దింకలతో నిండిన గదిలో జాన్వీ బంధిఖానా



బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో క్షణం తీరిక లేకుండా ఉంది జాన్వీ కపూర్. ఈ యంగ్ బ్యూటీ నటించిన మిలీ ఎట్టకేలకు నవంబర్ 4న పెద్ద తెరపైకి వచ్చింది. పాజిటివ్ సమీక్షలతో మిలీ బాక్సాఫీస్ వద్ద బాగానే రాణించిందని ట్రేడ్ వెల్లడించింది. మత్తుకుట్టి జేవియర్ దర్శకత్వం వహించిన ఈ సర్వైవల్-థ్రిల్లర్ లో సన్నీ కౌశల్ – మనోజ్ పహ్వా కూడా ప్రధాన పాత్రలు పోషించారు. ఇది మలయాళ భాషా చిత్రం హెలెన్ కి రీమేక్. ఈ సినిమాని జాన్వీ తండ్రి బోనీకపూర్ స్వయంగా నిర్మించడం ఆసక్తికరం. పాపా బోనీ నిర్మాతగా మొదటి సహకారం జాన్వీకి చాలా ప్రత్యేకమైనది. తన స్పెషల్ సర్వైవల్ డ్రామాను ప్రచారం చేస్తూ తాజాగా జాన్వీ చెప్పిన ఓ సంగతి యువతరంలో హాట్ టాపిగ్గా మారింది. తాను బొద్దింకలతో నిండిన గదిలో ఎందుకు బంధించబడాలనుకుంటోందో జాన్వీ ఈ ఇంటర్వ్యూలో వివరించింది. ఒకవేళ బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితే లేదా మిలీ సినిమాలో లాగా ఫ్రీజర్ లో బంధించబడితే..? ఈ రెండిటిలో ఏది బెస్ట్.. మీరైతే ఏం చేస్తారు? మీ ఫీలింగ్ ఏంటీ? అంటూ హెూస్ట్ జాన్వీ కపూర్ ని సరదాగా ప్రశ్నించారు. దానికి జాన్వీ ఆసక్తికర సమాధానం ఇచ్చింది. నేను ఫ్రీజర్ లోకి తిరిగి వెళ్లలేను. నేను బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితేనే బెటర్ అని చెప్పింది. ఫ్రీజర్లో ఉండటం చాలా కష్టంగా ఉందని కూడా జాన్వీ తెలిపింది. జాన్వీ కపూర్ మిలీ కథాంశం ఆసక్తికరం. ఒక ప్రముఖ ఫాస్ట్ ఫుడ్ ఫ్రాంచైజీలో వెయిటర్ గా పనిచేసి 48 గంటలకు పైగా ఫ్రీజర్ లో బంధించబడిన ఒక అమ్మాయి కథేమిటన్నది తెరపై చూపించారు. ఈ థ్రిల్లర్ కాన్సెప్ట్ లో జాన్వీ ఎమోషనల్ పెర్ఫామెన్స్ తో కట్టి పడేసిందని క్రిటిక్స్ ప్రశంసించారు.

# ఆ రెండు విమర్శలకు ఊర్వశి గట్టి సమాధానం

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రెండు రోజుల పాటు సందడి చేసిన ఊర్వశి రౌతేలాను ఈ రెండు విషయాల పట్ల సోషల్ మీడియాలో తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. దాంతో ఊర్వశి స్పందించింది. బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలా మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ ఏడాది ఆరంభం నుంచి దబిడి దిబిడి పాటతో తెగ వార్తల్లో నిలుస్తున్న ఈ అమ్మడు తాజాగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సందడి చేసింది. అక్కడి రెడ్ కార్పెట్‌పై హొయలు పోతూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. అంతే కాకుండా పలు ఇంటర్వ్యూలు ఇవ్వడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. బాలీవుడ్‌లో ఎంతో మంది స్టార్స్ ఉండగా కేన్స్ రెడ్ కార్పెట్‌పై నడిచే అవకాశం తనకు దక్కడం పట్ల ఊర్వశి రౌతేలా చాలా సంతోషంగా ఉంది. సోషల్ మీడియాలో ఈమె కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫోటోలు, వీడియోలు తెగ సందడి చేస్తున్నాయి. ఇదే సమయంలో ఈమె గురించి ట్రోల్స్ కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రెడ్ కార్పెట్‌పై ఊర్వశి రౌతేలా నడిచిన సందర్భంలో ధరించిన డ్రెస్ గతంలో ఐశ్వర్య రాయ్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న సమయంలో ధరించిన డ్రెస్‌ను పోలి ఉంది అంటూ పలువురు సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ విషయంపై స్వయంగా ఊర్వశి స్పందించాల్సి వచ్చింది. అంతే కాకుండా ఊర్వశి రౌతేలా పొడవాటి డ్రెస్‌ను ధరించి వేదిక వద్ద ఫోటోలకు ఫోజ్‌లు ఇచ్చేందుకు చాలా సమయం తీసుకుంది. దాంతో మెట్ల వద్ద చాలా మంది అసౌకర్యంకు గురి అయ్యారు. ఆమె మెట్లకు అడ్డుగా ఉండటంతో పాటు, ఆమె డ్రెస్ పెద్దగా ఉండటం వల్ల ఇతర సెలబ్రిటీలు ఇబ్బంది పడ్డారు అంటూ నెటిజన్స్ అసహనం వ్యక్తం చేశారు. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రెండు రోజుల పాటు సందడి చేసిన ఊర్వశి రౌతేలాను ఈ రెండు విషయాల పట్ల సోషల్ మీడియాలో తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. దాంతో ఊర్వశి స్పందించింది. తాను ఎవరినో ఫాలో కాలేదు, నాకంటూ ప్రత్యేక శైలి ఉంది, నా స్టైల్‌లో నేను కేన్స్‌లో కనిపించాను. కొందరు కావాలని నా డ్రెస్‌ను, నా స్టైల్‌ను కాపీ అంటూ ప్రచారం చేయడం చూస్తూ ఉంటే ఆశ్చర్యంగా ఉందని ఊర్వశి రౌతేలా అసహనం వ్యక్తం చేసింది. నన్ను నకిలీ అంటూ ప్రచారం చేస్తున్న వారి గురించి తెలుసు. కానీ నేను ఎప్పుడూ నకిలీ కాదు, నేను ఒరిజినల్ అంటూ ఊర్వశి చెప్పుకొచ్చింది. ఊర్వశి రౌతేలా నకిలీ అంటూ కొందరు చేస్తున్న ట్రోల్స్‌కి గట్టి సమాధానంను ఇచ్చింది. ఇదే సమయంలో మెట్లకు అడ్డుగా ఉన్నావు అంటూ చేస్తున్న



విమర్శలపై కూడా ఊర్వశి రౌతేలా స్పందించింది. నా ఫోటో షూట్ కారణంగా మెట్ల దారిని బ్లాక్ చేశానంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. కానీ ముందుగానే నేను అక్కడ ఫోటోలను దిగేందుకు అనుమతి తీసుకున్నాను. కేన్స్ వేడుకలో పాల్గొన్న సమయంలో నేను అక్కడి ప్రతి రూల్ పాటించాను, అక్కడి వారి నిర్దేశం ప్రకారం నడుచుకున్నాను. అక్కడి వారిని గౌరవిస్తూ, అక్కడ నిబంధనలను గౌరవిస్తూ నేను రెడ్ కార్పెట్ పై వాక్ చేశాను అంటూ చెప్పుకొచ్చింది. కొందరు కావాలని తనపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఊర్వశి రౌతేలా అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి ట్రోల్స్ పట్టించుకోను, మీరు నన్ను ట్రోల్ చేసినంత మాత్రాన నేను మిమ్ములను ట్రోల్ చేయడానికి డబ్బు వృద్ధా చేసుకోను అంటూ ఊర్వశి రౌతేలా గట్టి కౌంటర్ ఇచ్చింది.

# మళయాళ భామ 'కుమారి'గా వస్తుంది..!

మళయాళంలో తన నటతో మెప్పిస్తూ వస్తున్న ఐశ్వర్య లక్ష్మి ఈమధ్య తమిళ సినిమాల్లో కూడా సందడి చేస్తుంది. తెలుగులో గాడ్సే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఐశ్వర్య లక్ష్మి. రీసెంట్ గా పొన్నియిన్ సెల్వన్ 1 సినిమాతో కూడా అమ్మడు ఆకట్టుకుంది. సినిమాలో తన పోర్షన్ వరకు అదరగొట్టేసింది ఐశ్వర్య. సినిమాలే కాదు ఓటీటీ వెబ్ సీరీస్ లతో కూడా ఆడియన్స్ ని అలరిస్తుంది అమ్మడు. ఇటీవలే అమ్ము అంటూ ఓ తెలుగు వెబ్ సీరీస్ తో వచ్చిన ఐశ్వర్య లక్ష్మి ఆ సినిమాతో ప్రశంసలు అందుకుంది. ఆ మూవీ తర్వాత కొద్దిపాటి గ్యాప్ తోనే మరో మూవీతో వస్తుంది ఐశ్వర్య. ఈసారి కుమారి అంటూ ఒక మైథలాజికల్ ఫాంటసీ మూవీతో వస్తుంది. ఈ మూవీని నిర్మల్ సహదేవ్ డైరెక్ట్ చేశారు. నెట్ ఫ్లిక్స్ లో ఈ సినిమా నవంబర్ 18 శుక్రవారం రిలీజ్ అవుతుంది. అమ్ము సినిమాతో ఒక ఇంప్యాక్ట్ క్రియేట్ చేసిన ఐశ్వర్య లక్ష్మి కుమారితో కూడా అలరిస్తుందని అంటున్నారు. ఇప్పటికే నెట్ ఫ్లిక్స్ లో వస్తున్న కుమారి మూవీ టీజర్ ట్రైలర్ ఈ సీరీస్ పై ఆసక్తి కలిగించాయి. థియేటర్ లోనే వస్తేనే కాదు తమకు నచ్చిన కంటెంట్ ఎక్కడ రిలీజైనా సరే చూసేస్తున్నారు ప్రేక్షకులు. ముఖ్యంగా సినిమా టికెట్ల రేట్లు పెరగడం..




# మరోసారి బోల్డ్ గా ఒంపుల్ని ప్రదర్శించిన ఇషా



టాప్ మోడల్ కం నటి ఇషా గుప్తా పరిచయం అవసరం లేదు. గ్లామర్ షో విషయంలో హద్దులు చెరిపేసి చెలరేగడం ఈ సీనియర్ బ్యూటీ ప్రత్యేకత. ఇన్ స్టా వేదికగా ఇషాగుప్తా ఎప్పటికప్పుడు చెలరేగి అందాలు ఆరబోస్తుంది. తాజాగా ఇషా షేర్ చేసిన బోల్డ్ ఫోటోషూట్ అంతర్జాలంలో దుమారం రేపుతోంది. ఇషాజీ మరోసారి తనదైన శైలిలో చెలరేగారు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్డ్ గౌలో వజ్రంలా మెరుస్తోంది. ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రాప్డ్ స్లీవ్ లో గ్లామర్ ని ఆవిష్కరించిన తీరు కుర్రకారుకు మైండ్ బ్లాక్ చేస్తోంది. మోడల్ కం నటి పర్యావరణవేత్త అయిన ఈషా గుప్తా నటిగా ఇప్పటికే బాలీవుడ్ లో తనదైన ముద్ర వేసింది. తిరుగులేని ఎనర్జీతో స్టైల్ ఐకాన్ గా వెలుగులు విరజిమ్ముతోంది. తన స్టైల్ పై రెగ్యులర్ అప్ డేట్ లతో ఈషా ఇప్పటికే 13 మిలియన్లకు పైగా ఇన్ స్టాగ్రామ్ ఫాలోవర్ల ఫాలోవర్ లను సంపాదించింది. ఈషా గుప్తా నిరంతర ఫ్యాషన్ సెన్స్ పై నేటితరంలో డిబేట్లు సాగుతుంటాయంటే అర్థం చేసుకోవాలి. తాను ఎంచుకున్నది ఎత్నిక్ వేర్ అయినా... ఆరు గజాల పవిట కొంగుతో చీరలో అయినా.. అందమైన గౌనులో అయినా తన డ్రెస్సింగ్ సెన్స్ నుంచి కళ్లు తిప్పుకోవడం అంత ఈజీ కాదు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్డ్ గౌలో ఒంపులు రంగరించిన తీరుపై చర్చా సాగుతోంది. ఇషాజీ ఫ్యాషన్ ప్రపంచపు మహారాణి. రకరకాల ఫ్యాషన్ దుస్తులకు స్టైలింగ్ చేస్తూ మోడల్ గా అదరగొడుతుంటుంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com